క్లుప్తంగా

'కార్మికుల సంక్షేమాన్ని మరిచిన యాజమాన్యం'



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి యాజమాన్యం గని కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు సాంబారు వెంకటస్వామి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎండాకాలం మొదలైన నేపథ్యంలో అన్ని ఏరియాల్లో కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు ఇస్తుంటే, మందమర్రి ఏరియాలో మాత్రం ఇవ్వటంలేదన్నారు. గతంలో వేసవికాలంలో రెండు గంటల సమయం వేళలు మార్చేవారని, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గెలిచిన సంఘాలను దగ్గర పెట్టుకుని యాజమాన్యం ఇష్టారీతిన చేస్తోందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు అల్లి రాజేందర్, రామగిరి రామస్వామి, ఐలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పరివార్ ఆత్మీయ సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక గీతా అధ్యయనం మండలి ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. భగవద్గీత ఖండ పారాయణం పఠించారు. కార్యక్రమంలో గీతాఅధ్యయనం మండలి నిర్వాహకుడు రాజేశం, భక్తులు పాల్గొన్నారు.

రాంజీగోండుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్ యాప వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు రాంజీగోండు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రాంజీగోండు చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా వర్ధంతిని అధికారికంగా జరపాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, ఆదివాసీ నాయకపోడు సంఘం రాష్ట్ర కోశాధికారి బాపు, సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు తిరుపతి, భీంరావు, లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

కాసిపేట: ఈ నెల 16న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కాసిపేట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. దీనికి సంబంధించిన లింక్‌లను ఆన్‌లైన్ ద్వారా ఓపెన్ చేసుకొని హాల్‌టికెట్లు పొందాలని కోరారు.

ఆర్థిక చేయూత


రాజేందర్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మిత్రులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ ఆర్‌కే 5 కాలనీకి చెందిన బెందల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమతో చదువుకున్న తోటి మిత్రుడి మృతి విషయం తెలుసుకున్న సీసీసీ సింగరేణి హై స్కూల్ 1996–97వదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సీసీసీలోని రాజేందర్ ఇంటి వద్ద మృతుడు కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కటుకూరి సతీష్‌కుమార్, మద్దె చేరాలుయాదవ్, రమేశ్, స్వామి, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



నెన్నెల: మండలంలోని గొల్లపల్లికి చెందిన ఐదుగురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళతో కలిసి బాధితులకు అందజేశారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేష్, నాయకులు సింగతి రాంచందర్ పాల్గొన్నారు.

సాగునీటికి అరిగోస..!


ఫొటోలో కనిపిస్తున్న ఎండిన మొక్కజొన్న చేను తాళ్లపేటకు చెందిన కుందారపు చెంద్రయ్యది. నీళ్లు వస్తయనే ఆశతో రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశాడు. అయితే చెక్‌డ్యాంలో నీళ్లు లేక.. కడెం నీళ్లు అందకా, చేను మొత్తం ఎండింది. దీంతో రైతు యాసంగి పంట సాగుపై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి.


శిథిలమైన చెక్‌డ్యాం

- చెక్‌డ్యాంకు మరమ్మతులు కరువు
- ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దండేపల్లి: కడెం డిస్ట్రిబ్యూటరీ 23వ కాలువకు అనుసందానంగా, దండేపల్లి మండలం తాళ్లపేట వాగుపై గత 40ఏళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో అది పూర్తి శిథిలావస్థకు చేరింది. దీంతో ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. చెక్‌డ్యాం నుంచి పూర్తిస్థాయిలో నీరందడంలేదని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. డీ 23కింద సుమారు వెయ్యి ఎకరాల సాగుభూమి ఉన్నప్పటికీ, తాళ్లపేట చెక్‌డ్యాం ద్వారా సుమారు 500ఎకరాలకు సాగునీరందేలా రూపకల్పన చేశారు. కానీ ప్రస్తుతం చెక్‌డ్యాం శిథిలమైనప్పటి నుంచి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. ప్రతిసారీ రైతులే తాత్కాలిక మరమ్మతు చేసుకుంటూ సాగునీటిని పారిస్తున్నారు. దీని మరమ్మతుల గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఇదీ పరిస్థితి...

తాళ్లపేట వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నుంచి డీ–23కి అనుసందానంగా కాల్వ నిర్మాణం చేపట్టారు. చెక్‌డ్యాం నీరు, అనుసందాన కాల్వ ద్వారా డీ–23లో కలుస్తాయి. ఈ నీరు, తాళ్లపేట శివారు భూములతో పాటు, జన్నారం మండలం రాంపూర్, దండేపల్లి మండలంలోని గుడిరేవు శివారు భూములకు వెళ్లాయి. చెక్‌డ్యాం పూర్తి శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్లుగా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదు. ఎగువన మొత్తం పూడికతో నిండి, అందులో నీటినిల్వ తగ్గిపోయింది. చెక్‌డ్యాం షెటర్స్ పాడైపోవడంతో, ఉన్న కొద్దిపాటి నీళ్లు అందులోంచి లీకై కిందికి వెళ్తున్నాయి. ఈ సమయంలో చెక్‌డ్యాంలో నీటిని నిల్వ చేసేందుకు, షెటర్ల నుంచి నీళ్లు లీకై పోకుండా రైతులే అడ్డుకట్టలు వేసి నీటిని నిల్వ చేసి, కాపాడుకుంటూ పంటలకు పారిస్తున్నారు. దీంతో ఆ నీళ్లు ఆయకట్టు చివరిదాక వెళ్లడం లేదు.

ఏం చేస్తే బాగుంటుంది..

చెక్‌డ్యాం గోడలకు మరమ్మతులు చేసి, అందులో పూడిక తీసి నీటి నిల్వ పెరిగేలా చేయాలి. పైగా నిలిచి ఉన్న నీరు కిందకు వెళ్లకుండా కొత్త షెటర్లు నిర్మించాలి. చెక్‌డ్యాం నుంచి డీ–23 వరకు ఉన్న అనుసందాన కాల్వకు సిమెంట్ లైనింగ్ వేయాలి.

అనుసంధాన కాలువ అధ్వానం



చెక్‌డ్యాం నుంచి డీ–23 వరకు నిర్మించిన అనుసంధాన కాల్వ మరీ అధ్వానంగా తయ్యారయ్యింది. ఎలాంటి సిమెంటు లైనింగ్ లేకపోవడంతో కాల్వ మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో పాటు, అక్కడక్కడ పూడుకుపోయింది. దీంతో కాల్వ ఆనవాళ్లు కనిపించకుండా అయ్యాయి. ఏటా ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతులే కాల్వను బాగుచేయడం, చెక్‌డ్యాం నుంచి నీళ్లు లీకవకుండా, చూసుకోవడం చేస్తున్నారు. అయినా చెక్‌డ్యాంలో నీళ్లు లేక నీటి కోసం రైతులు గోసపడుతున్నారు.

ఏటా నీటి కష్టాలే..



మా పొలాలకు కడెం నీళ్లు సక్కగా రావు. మాటు(చెక్‌డ్యాం)నీళ్లే మాకు దిక్కు. మాటు మొత్తం పాడయ్యింది. షెటర్లు మొత్తం పాడైనయి. దీంతో అందులో నీళ్లు నిల్వ ఉంటలేవు. షెట్టర్లు పాడైనప్పటి నుంచి నీళ్లు వెళ్లిపోకుండా గడ్డి, ఇసుక సంచులు వేసి, నీళ్లను కాపాడి, కాల్వకు మళ్లించి పారించుకుంటున్నాం. ప్రతిసారీ మాకు నీటికష్టాలే ఉంటున్నాయి.

– పేరం మల్లేష్, రైతు, తాళ్లపేట

మరమ్మతు చేపించాలి



తాళ్లపేట మాటు(చెక్‌డ్యాం)కు మరమ్మతు చేపించాలి. లేకుంటే ఆయకట్టు రైతులకు చాలా ఇబ్బంది అయితది. మాటు గోడలు బాగు చేయించాలి. షెటర్లు కొత్తవి పెట్టాలి. అనుసందాన కాల్వకు సిమెంటు లైన్‌వేయాలి. అట్లయితేనే మా పొలాలకు నీళ్లు అత్తయి. మాటు మరమ్మతుల విషయంలో అధికారులు, లీడర్లు పట్టించుకోవాలి.

– ముత్తె పోషన్న, రైతు, తాళ్లపేట

పోచమ్మా.. సల్లంగ చూడమ్మా


పోచమ్మ తల్లికి బోనం తీసుకెళ్తున్న గ్రామస్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వివిధ వాహనాల్లో వచ్చి ముందుగా స్థానిక వాగుల్లోని గుండాల్లో పుణ్యస్నానం ఆచరించి, నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి ఇంటిల్లిపాదిని సల్లంగా చూడాలి అంటూ వేడుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని విందు భోజనాలు ఆరగించారు.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దు గ్రామంలో పోచమ్మబోనాలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాన్ని పోచమ్మకు సమర్పించారు. మహిళలు భక్తి ప్రపత్తులతో డప్పుచప్పుళ్ల మధ్య బోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పురవీధులన్నీ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. గ్రామదేవత పోచమ్మతల్లికి మహిళలు నైవేద్యం సమర్పించి సల్లంగా చూడాలని వేడుకున్నారు. కోళ్లు, మేకలను బలిచ్చారు. కలిసికట్టుగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 11నుంచి ఆత్మీయ సమ్మేళనాలు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ఈ నెల 11నుంచి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బాల్కసుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చెన్నూర్ నియోజకవర్గంలోని 5మండలాలు, 3మున్సిపాలిటీల్లో 8 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 11న చెన్నూర్ పట్టణంలోని సంతోషి మాత ఫంక్షన్ హాల్, 12న జైపూర్ మండలంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్ (దుబ్బాపల్లి)లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మేళనాలకు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకున్న 50,964మందితో పాటు వారి కుటుంబ సభ్యులను ఆహ్వానిస్తామన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. భోజన విరామ అనంతరం గ్రామాల వారీగా సమావేశాలు ఉంటాయని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనాలకు మండల, మున్సిపాలిటీలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


దండేపల్లి:సీఎస్‌ఐ చర్చి వద్ద శిలువ వెలిగింపులో క్రైస్తవ భక్తులు

దండేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ భక్తులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణించి మరల లేచిన సందర్భంగా క్రైస్తవ భక్తులు శిలువ వెలిగింపు కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్యాండిల్స్‌తో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

తాళ్లపేటలో చీరలు పంపిణీ..

ఈస్టర్ వేడుకల్లో భాగంగా మండలంలోని తాళ్లపేట సీఎస్‌ఐ చర్చిలో 30మంది మహిళలకు పాస్టర్లు విద్యాసాగర్, డేవిడ్‌పాల్, వంశీ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్, తిరుపతి, రవి, పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ఈస్టర్ పండుగను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్‌ఐ చర్చి సమీపంలోని సిల్వ గుట్టపై చర్చి ఫాదర్ కరుణాకర్ క్రైస్తవ భక్తులకు ప్రత్యేక సందేశం అందించారు.

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను క్రిస్టియన్లు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. భీమారంలోని క్యాథలిక్ చర్చిలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ మేరకు పాస్టర్ జ్యోబీ మాధ్యూ ప్రత్యేక పార్థనలు చేసిన అనంతరం ఈస్టర్ పండుగ గురించి వివరించారు. ఐఈఎం చర్చిలో వందలాది మంది క్రిస్టియన్లు పార్థనల్లో పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారికి భోజన సదుపాయం కల్పించారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆయా క్రైస్తవ సంఘాల్లో ఆదివారం ఈస్టర్ పండగను ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ సేయింట్ పీటర్స్ చర్చిలో ఉదయం 5గంటలకే ప్రత్యేక ఆరాధనను ప్రారంభించారు. చర్చి పాస్టర్ జాషువా ఈస్టర్ దైవసందేశాన్ని అందించారు. పాపుల అపరాధములను తాను భరించి ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసి మృత్యుంజయుడిగా తిరిగి లేచాడని, పునరుత్థాన విశ్వాసాన్ని ప్రతీ వ్యక్తి కలిగియుండాలన్నారు. ఆరాధనలో స్త్రీలమైత్రి వారు, పురుషులు ఆలపించిన ప్రత్యేక గీతాలు ఆకట్టుకున్నాయి.


భీమారంలోని ఐఈఎంచర్చిలో...


రామకృష్ణాపూర్: సీఎస్‌ఐ చర్చిలో..


లక్సెట్టిపేటలో...

సొంతింటి పథకం అమలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నస్పూర్: సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మంచిర్యాలలోని ఆయన నివాసం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కంపెనీ క్వార్టర్ లేని కార్మికులకు 250గజాల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు మిడివెల్లి శంకర్, గోదారి భాగ్యరాజు, ఆర్గనైజర్ కస్తూరి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచి సెక్రటరీ అల్లి రాజేందర్, నాయకులు గంగాధరచారి, రాజేశం, శ్రీనివాస్, భానేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వానికి పట్టింపులేదని నిరసిస్తూ ఆదివారం వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి హైస్కూల్ ఎదుట కోల్‌బెల్ట్ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ దుర్గం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించాలని, నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అజీమొద్దీన్, రాజేంద్రప్రసాద్, ప్రభుదేవ, కవిరాజ్, శ్రీనివాస్, సత్యవతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

చెన్నూర్: స్థానిక ఎస్‌జీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంత్రి బాపు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఎస్సై శ్వేత, ప్రిన్సిపాల్ మేడ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కోరాళ్ల శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనలో చైర్మన్ విఫలం'


బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా 9వ వార్డులో మౌలిక వసతుల కల్పనలో స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ విఫలమయ్యారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ నయీం పాషా విమర్శించారు. ఆమ్‌ఆద్మీ బస్తీబాట కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు ఆదివారం 9వ వార్డులో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. రాము, రాజేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయానికి భూమి విరాళం

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మలో నిర్మించే శివాలయానికి గ్రామానికి చెందిన కార్యూరి పెద్ద రాజయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు తిరుపతి, సురేందర్, భూమన్న ఐదు గుంటల భూమిని ఆదివారం విరాళంగా అందించారు. ఆ భూమిలో గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో బోరు వేయించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని పలువురు కోరారు.

పద్దనపల్లిలో గడపగడపకూ బీఆర్‌ఎస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పద్దనపల్లిలో ఆదివారం గడపగడపకూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమం పార్టీ నాయకులు చేపట్టారు. గ్రామంలో గడపగడపకూ వెళ్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, సర్పంచ్ గోళ్ల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీసీ కెమెరాలు తప్పనిసరి'

దండేపల్లి: గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి అని దండేపల్లి ఏఎస్‌ఐ వెంకన్న అన్నారు. మండలంలోని తాళ్లపేటలో సీసీ కెమెరాల గురించి ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉన్న కెమెరాల పనితీరును పరిశీలించారు.

అంబలికేంద్రం ప్రారంభం

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం వద్ద జీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని పద్మశాలిసంఘం అధ్యక్షుడు గుడిమల్ల వెంకటేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో యువకులు కొక్కుల నరేష్, రేషవేని శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన గుమ్మడి ప్రత్యూషకు సీఎం సహాయనిధి నుంచి రూ.24వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి ఆమెకు అందించారు.

12న మండల సమావేశం

నెన్నెల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 12న మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

తాండూర్: మండలంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా గొర్లపల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దుర్గం లక్ష్మీనారాయణ, దుర్గం మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా దాగం పాపయ్య, కోశాధికారిగా డోలి రాజన్న, సలహాదారులుగా జాడి పోశం, దుర్గం శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర కమిటీ నాయకులు ప్రకటించారు.

మండలాధ్యక్షుడిగా సంపత్

జైపూర్: మండల మాదిగ హక్కుల దండోరా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మాదిగ హక్కుల దండోరా జిల్లా ఉపాధ్యక్షుడు జలంపల్లి భానేశ్ ఆధ్వర్యంలో సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్, జిల్లా అధ్యక్షుడు కడారి రమేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా జనంపల్లి సంపత్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రశాంత్, అధికార ప్రతినిధిగా చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా రామగిరి ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా సుందిళ్ల కన్నయ్య, గాలిపల్లి కుమారస్వామి, గడ్డం అరుణ్‌ను నియమించినట్లుగా ప్రకటించారు.

బద్దెంపల్లికి భగీరథ నీళ్లు రావా..?



వేమనపల్లి: బద్దెంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సాంకేతిక సమస్యతో ఊరికి నీళ్లు రావడం లేదని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెరుగన్నం పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) ఆధ్వర్యంలో ఆదివారం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు పెరుగన్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏబీఏపీ అధ్యక్షుడు నర్సింహరావు, ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు పాల్గొన్నారు.